

జహీరాబాద్ పట్టణంలో కేకును కట్‌చేసి సంబురాలు చేసుకుంటున్న మహిళలు



మెదక్ వెంకటేశ్వరాలయంలో భక్తుల పూజలు





ఏడుపాయల వనదుర్గామాత ఆలయ ఆవరణలో జాతరను తలపించేలా భక్తులు, మెదక్ సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

# నూతనోత్సాహం

## కొత్త ఏడాదికి ఘనంగా స్వాగతం

### ఆలయాలకు పోటెత్తిన భక్తులు

### కేకులు కట్ చేసి శుభాకాంక్షలు

మెదక్ అర్బన్/మెదక్ కల్చరల్/పాపాన్నపేట/ సంగారెడ్డి రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి) : తీపి, చేదు జ్ఞాపకాల 2024వ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. కొత్త ఆశల 2025 నూతన ఏడాదికి జిల్లా ప్రజలు అట్టహాసంగా స్వాగతం చెప్పారు. బుధవారం నూతన సంవత్సర సంబరాలను మిన్నంటేలా జరుపుకున్నారు. మహిళలు వాకిట్లో చూడముచ్చటైన రంగువల్లులను తీర్చిదిద్ది ముగ్గులతో శుభాకాంక్షలు తెలిపారు. చిన్నాపెద్దా, యువతీయువకులు సెల్ఫీలు దిగుతూ ఆనందోత్సాహాల మధ్య గడిపారు. చికెన్, మటన్ దుకాణాలు కిటకిటలాడాయి. చికెన్, మటన్ బిర్యానీల వైపు మొగ్గు చూపడంతో రెస్టారెంట్లు కిటకిటలాడాయి. కొత్త సంవత్సరానికి కేకులను కట్ చేస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఇళ్లల్లో, అపార్ట్‌మెంట్లలో, సంఘాల వారీగా, బ్యాచ్‌ల వారీగా కేకులను తెచ్చి కట్ చేశారు. గ్రామాల్లోనూ యువకులు, పిల్లలు కేక్‌లను కట్ చేసి ఉత్సాహంగా గడిపారు. కొత్త సంవత్సరం మొదటి రోజున దైవదర్శనం చేసుకుంటే ఏడాదంతా శుభం కలుగుతుందని భావించి పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివెళ్లారు. ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గమ్మ సన్నిధి భక్తజనసంద్రంగా మారింది. ఉమ్మడి జిల్లా వాసులతో పాటు పరిసర జిల్లాలు, జంటనగరాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో జాతరను తలపించింది. జనం అధిక సంఖ్యలో రావడంతో అమ్మవారి దర్శనానికి గంటల తరబడి వేచిఉండాల్సి వచ్చింది. వాహనాలు రద్దీతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. వనదుర్గామాతను కలెక్టర్ రాహుల్‌రాజ్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి నుంచే బిషప్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవసందేశాన్ని అందించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శతాబ్ది సంబరాలలో భాగంగా భక్తులు, సందర్శకుల సందడి కొనసాగుతూనే ఉంది. మెదక్ పట్టణంలోని వేంకటేశ్వరాలయం, కోదండ రామాలయం, సంగారెడ్డి పట్టణ శివారు వైకుంఠపురానికి తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. సంగారెడ్డి మండల పరిధి పోతిరెడ్డిపల్లి శివారులోని రాక్‌చర్చిలో పాస్టర్ యేసు పాల్ పర్యవేక్షణలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## తగ్గేదేలే..!

- మద్యం తాగి రోడ్డెక్కిన మందుబాబులు
- డ్రంకెన్ డ్రైవ్‌లో 282 మంది పట్టివేత
- నేడు కోర్టులో హాజరు పరచనున్న పోలీసులు

సంగారెడ్డి క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా డిసెంబరు 31 అర్ధరాత్రి మద్యం తాగి వాహనాలు నడపొద్దని పోలీసులు పదేపదే సూచించినా మందుబాబులు మాత్రం తగ్గేదేలే అంటూ వ్యవహరించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్డెక్కారు. ప్రత్యేకంగా ఆ రోజు ఎవరైనా మద్యం తాగి పోలీసులకు చిక్కితే జరిమానాలతో పాటు జైలుకెళ్లడం ఖాయమని

మిగతా 8వ పేజీలో..

# కిక్కు@24.93 కోట్లు

### గతేడాదితో పోల్చితే పెరిగిన మద్యం విక్రయాలు

### ఆబ్కారీ శాఖకు భారీగా ఆదాయం

మెదక్ అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సర వేడుకలు ఎక్సైజ్ శాఖకు భారీగా కలిసొచ్చాయి. నూతన సంవత్సరానికి స్వాగత పలుకుతూ మద్యం ప్రియులు మందు ఏరులై పారించారు. డిసెంబరు 31 అర్ధరాత్రి వరకు వైన్స్ షాపులు, బార్లు తెరిచి ఉంచడంతో మద్యం ఆదాయం కోట్లకు పరుగూ తీసింది. పోలీసు ఆంక్షలు ఉన్నప్పటికీ మద్యం, మాంసంప్రియులు మాత్రం ఇవేవీ లెక్కచేయకుండా జోష్‌లో



సంగారెడ్డిలో అర్ధరాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మునిగి తేలారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సంగారెడ్డి, పటాన్ చెరువు, జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, అందోల్ జోగిపేట సర్కిల్స్ పరిధిలోని 101 మద్యం దుకాణాలు, 34 బార్లు ఉన్నాయి. మెదక్ జిల్లా వ్యాప్తంగా మెదక్, రామాయంపేట, నర్సాపూర్ సర్కిళ్ల పరిధిలో 49 వైన్స్‌లు, 4 బార్లు ఉన్నాయి. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వైన్‌షాపులన్నీ కిటకిటలాడాయి. ఐఎంఎల్ డిపో పరిధిలో రెండు రోజుల్లో రూ.24.93 కోట్ల మద్యంను విక్రయించారు. డిసెంబరు 30న లిక్కర్ 14,984, బీర్లు 16,714 కేసులు అమ్ముడుపోయాయి. దాంతో రూ. 14.85 కోట్లు, డిసెంబరు 31న లిక్కర్ 10,233, బీర్లు 11,234 కేసులు విక్రయించగా రూ. 10.08 కోట్లు ఆదాయం వచ్చింది. దీంతో రెండు రోజుల్లో మొత్తం రూ. 24.93 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఎక్సైజ్ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గతేడాదిలో పోల్చితే ఈ సారి రూ.8 కోట్లపైగా ఆబ్కారీ శాఖకు ఆదాయం సమకూరడం గమనార్హం.

### జోరుగా మాంసం విక్రయాలు

డిసెంబరు 31 అంటేనే మందు, మాంసం ఉండడం సహజం. డిసెంబరు 31తో పాటు జనవరి 1న మాంస విక్రయాలు జోరుగా సాగాయి. రెండు రోజులు పార్టీలతో హోరెత్తడంతో మాంసాహార ప్రియులు వివిధ నాన్‌వెజ్ రుచులను ఆస్వాదించారు. కిలో మటన్ ధర రూ.800 నుంచి 900 వరకు పలికింది. మెదక్ జిల్లాలో దాదాపు రూ.4 కోట్ల వరకు, సంగారెడ్డి జిల్లాలో 6.50 కోట్ల మేర మటన్, చికెన్, చేపల అమ్మకాలు జరిగి ఉండవచ్చని సంబంధిత శాఖల అధికారులు పేర్కొంటున్నారు.

## పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న సీఎం

- సంగారెడ్డి జిల్లాలో కేసులు భారీగా పెరిగాయి
- లోగోలు మార్చుడు కాదు శాంతిభద్రతలపై దృష్టిసారించాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 1 : పోలీసు వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వీర్యం చేస్తున్నాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. బుధవారం ఆయన సంగారెడ్డిలోని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశానికే శిక్షణ ఇచ్చిన తెలంగాణ పోలీసులను నేడు రాజకీయ కక్షల సాధింపు కోసం వాడుకుంటున్నాడని ఆగ్రహించారు. పోలీసుల లోగోలను మార్చడం కాదు.. వారి ద్వారా ప్రజలకు శాంతిభద్రతలు అందించాలని హితవు పలికారు. సంగారెడ్డి జిల్లాలో 2022 సంవత్సరానికి పోల్చితే ఈ ఏడాది 1000 కేసులు పెరిగాయని తెలిపారు. గతేడాదికి ఇప్పటికీ 31శాతం అత్యాచారాలు, దొంగతనాలు 52 శాతం పెరిగితే దోపిడీలు రెట్టింపయ్యాయని వివరించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించకపోవడం వల్ల నాలుగింతలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, నేతలు మల్కాపూర్ శివకుమార్, కాసాల బుచ్చిరెడ్డి, మఠం భిక్షపతి, మంజుశ్రీ, జలంధర్, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.



రేజింతల్ సిద్దివినాయక ఆలయంలో హరీశ్‌రావు

### వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం

సదాశివపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ 29వసారి అయ్యప్పస్వామి దీక్షను చేపట్టిన సందర్భంగా పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం పడిపూజ మహోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



### పంట తీయడానికి పెట్టిన ఖర్చూ వస్తలేదు



కౌలుకు తీసుకున్న పది గుంటల భూమిలో టమాటాను సాగు చేశా. రూ.20 వేల వరకు ఖర్చు పెట్టాను. ప్రస్తుతం ధర పడి పోవడంతో పెట్టుబడి కాదుకదా.. పంట తీయడానికి పెట్టిన ఖర్చులు దక్కని పరిస్థితి నెలకొన్నది.

- శంకర్, రైతు, ముగ్దంపూర్

### చేతికందే దశలో పడిపోయిన ధరలు



కొద్దినెలలుగా టమాట ధర ఆశాజనకంగా ఉండడంతో, పంటను సాగు చేశాను. అప్పుడు మార్కెట్‌లో కిలో రూ.40 నుంచి 50 వరకు పలికింది. ప్రస్తుతం నేను పండించిన పంటను తీసే సమయంలో కిలో రూ.10 కూడా పలుకడంలేదు. ఇంతా కష్ట పడితే పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదు.

- నర్సింలు, రైతు, ముక్టాపూర్

# టమాట ధర ఢమాల్

### పంట తీయడానికి పెట్టిన కూలీల ఖర్చు దక్కడం లేదు

### వారం రోజుల్లోనే తలకిందులైన ధరలు.. ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

నారాయణఖేడ్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): టమాట ధర ఒక్కసారిగా పడిపోవడంతో పొలం నుంచి పంట తీయడానికి పెట్టిన ఖర్చు కూడా దక్కడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వారం రోజుల క్రితం వరకు మార్కెట్లో చిల్లరగా కిలో టమాట రూ.50 చొప్పున విక్రయించగా, హోల్‌సేల్‌గా 25 కేజీల బాక్సు రూ.800 నుంచి 1000 వరకు పలికింది. ప్రస్తుతం మార్కెట్లో చిల్లరగా నాణ్యమైన టమాటాలే కిలో రూ.10 చొప్పున విక్రయిస్తుండగా, హోల్‌సేల్‌గా 25 కేజీల బాక్సు రూ.100కు మించి ధర పలుకడం లేదు. ఇటీవలి వరకు ధర ఆశాజనకంగా ఉండడంతో తాము టమాటాను సాగు చేశామని, తీరా పంటను తీసి మార్కెట్‌లో విక్రయించే సమయంలో ఒక్కసారిగా పడిపోవడంతో పెట్టుబడి కాదు కదా, పొలంలో నుంచి పంట తీయడానికి కూలీలకు ఇచ్చే ఖర్చులు కూడా దక్కడం కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. ఎకరాలో టమాటాను సాగు చేయడాలంటే దుక్కి దున్నడం, విత్తనాల కొనుగోలు, నారు తయారీ, క్రిమిసంహారక మందుల పిచికారీ, సస్యరక్షణ చర్యలు, ఇతర ఖర్చులు అన్నికలిపి రూ.80 వేల వరకు ఖర్చు వస్తుంది. మార్కెట్లో చిల్లరగా కిలో రూ.20 చొప్పున విక్రయిస్తే తప్ప నష్టం వాటిల్లదు. ప్రస్తుతం ధర పడిపోవడంతో పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి నెలకొన్నది. ఇటీవల వరకు లోకల్ టమాట మార్కెట్‌లో సరిపడా రాకపోవడంతో, అనంతపురం జిల్లా నుంచి తీసుకువచ్చి విక్రయించే వారు. ప్రస్తుతం లోకల్ టమాటాకే ధర రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు దక్కని పరిస్థితి ఏర్పడిందని దిగాలు చెందుతున్నారు.



తల్లిదండ్రులతో శ్రీశాంత్‌గౌడ్

## పసిడి పంచ్

- బాక్సింగ్‌లో రాణిస్తున్న సంగారెడ్డివాసి
- 24 టోర్నమెంట్లలో పోటీపడిన శ్రీశాంత్‌గౌడ్
- 8 బంగారు, ఒక కాంస్య పతకం సొంతం
- పలువురు ప్రముఖుల ప్రశంసలు

7

## పడుకున్న వ్యక్తి పైనుంచి వెళ్లిన లారీ

- అక్కడికక్కడే మృతి

7

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- ఎనిమిది మందికి గాయాలు

7

# జల్సాలకు బానిసై.. చోరీలకు అలవాటై

సికింద్రాబాద్ అడ్డగుట్టకు చెందిన మహ్మద్ షర్ఫొద్దీన్ అలియాస్ సాహిల్(19) క్లబ్ ఈవెంట్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరికి చెందిన గుడాల తిలక్ అలియాస్ టిల్లు(19) టీమాస్టర్. హైదరాబాద్ మల్లేపల్లి ఫిల్ఖానాకు చెందిన మహ్మద్ ఎస్సా(19), మహ్మద్ రంజాన్(19) బైక్ మెకానిక్‌లు. వీరంతా కలిసి బైక్ దొంగతనాలకు పాల్పడేవారు. వీరిపై సంగారెడ్డి, మెదక్ జిల్లాతో పాటు మహారాష్ట్రలోని ఉమర్గా పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి. ద్విచక్ర వాహనాలను దొంగిలించడం చవకగా అమ్మేయడం, తద్వారా వచ్చిన డబ్బుతో జల్సాలు చేయడం పరిపాటిగా మారింది. అయితే, 2024 ఆగస్టు 5వ తేదీన వీరిని భానూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారంతా గతంలో ఒకసారి జైలుకెళ్లినా తిరిగి వచ్చి మళ్లీ బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. పోలీసులకు చిక్కి రెండోసారి జైలుకెళ్లారు.

- చెడుమార్గంలో పయనిస్తున్న యువత
- పోలీసులకు పట్టుబడి కటకటాలపాలు

సంగారెడ్డి క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కొంతమంది యువత చెడుమార్గంలో పయనిస్తూ తల్లిదండ్రుల కలలను కళ్లలు చేస్తున్నారు. డబ్బు సంపాదన కోసం గొలుసు దొంగతనాలు, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో నేరాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కుతున్న వారిలో ఎక్కువగా యువతే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. సంగారెడ్డి జిల్లాలో ఏడాదికేడాది దొంగతనాలు పెరిగిపోతున్నాయి. సాధారణ దొంగతనాలు 2023లో 420 జరుగగా 2024లో 639 చోటు చేసుకున్నాయి. 52 శాతం నేర ప్రవృత్తి పెరిగింది. అలాగే గొలుసు దొంగతనాలు 40 శాతం పెరిగాయి. ఈ ఏడాదైనా నేరాలు తగ్గి, యువత మారేలా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నిందితులు పోలీసులకు పట్టుబడిన సందర్భంలో పోయిన సొమ్ము మాత్రం రికవరీ కావడం లేదు. గొలుసులు, బైక్‌లు దొంగతనం చేసిన వారంతా వాటిని తక్కువ ధరకు ఇతరులకు విక్రయిస్తున్నారు. దాని ద్వారా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. దీంతో సొమ్ము రికవరీ కావడం లేదు.

### రెండేళ్లుగా చోటు చేసుకున్న దొంగతనాలు

| సంవత్సరం | 2023 | 2024 |
|---|---|---|
| గొలుసు చోరీలు | 15 | 21 |
| సాధారణ దొంగతనాలు | 420 | 639 |
| రాత్రి దొంగతనాలు | 197 | 215 |
| పగటి దొంగతనాలు | 55 | 46 |

### దొంగతనాల కేసుల్లో రికవరీ

| సంవత్సరం | 2023 | 2024 |
|---|---|---|
| ఆస్తి విలువ | రూ.7,03,16,705 | రూ.7,55,31,071 |
| ఆస్తి రికవరీ | రూ.1,85,53,010 | రూ.3,73,21,274 |
| రికవరీ శాతం | 26 శాతం | 49 శాతం |



బీడీఎల్ భానూరు పోలీసుల అదుపులో బైకు నిందితులు

### రీల్స్ కాదు.. రియల్ లైఫ్‌లో బతకండి



నేటి సమాజంలో యువత మంచి కంటే చెడుకే ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. సినిమాల్లో లాగా జీవితాన్ని ఊహించుకొని చెడు అలవాట్లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఒక్కసారి పోలీసు రికార్డుల్లో పేరు నమోదైతే అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. తల్లిదండ్రులు వారి పట్ల అత్యంత శ్రద్ధ కనబర్చాలి. యువత రీల్స్ చేస్తూ కాదు.. రియల్ లైఫ్‌లో బతకాలి. అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను జాగృతం చేస్తున్నాం. యువత నిండు జీవితాలను నాశనం చేసుకోవద్దు.

- రూపేష్, ఎస్పీ, సంగారెడ్డి జిల్లా

## వంట మనిషి వాచ్‌మన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దశంకరంపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న వంట మనిషి, మహిళా వాచ్ మెన్ పోస్టులకు 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి విజయ బుధవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## బంగారమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

మనోహరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం కాళ్లకల్ జాతీయ రహదారి వద్ద వెలిసిన బంగారమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు.



# డబ్బులిస్తేనే 'మీ సేవ'

**దళారులకు అడ్డాలుగా కేంద్రాలు**
**ప్రతి పనికో రేటు పెట్టి వసూలు**
**ఇవ్వకుంటే దరఖాస్తు తిరస్కరణే..**






పటాన్‌చెరు రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మీసేవ కేంద్రాలు.. ఇప్పుడు ఏ పని అయినా అక్కడికి వెళ్లాల్సిందే. వివిధ ధ్రువపత్రాల కోసం దళారుల ప్రమేయం లేకుండా, అధికారుల పర్యవేక్షణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న సంకల్పంతో ఉమ్మడి రాష్ట్ర సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కారు 2011లో మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి సేవకు కొంత రుసుమును నిర్ణయించింది. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఇటీవల ప్రభుత్వం కొత్తగా మీ సేవ కనెక్ట్ యాప్‌ను అమల్లోకి తెచ్చింది. ఇదివరకు ఉన్న టీ ఆప్ ఫోలియోను పేరు మార్చి మీ సేవ యాప్‌ను ప్రారంభించింది. దీనిలో మీ సేవ కేంద్రాల్లో అందిస్తున్న సేవలన్నీ పొందే వెసులుబాటు కల్పించింది. దాని ప్రకారం నిర్వాహకులకు కమిషన్ రూపంలో కొంత చెల్లిస్తున్నారు. రెవెన్యూ, వ్యవసాయం, పోలీసు, విద్య, వైద్యం, విద్యుత్తు.. ఇలా వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి సుమారు 300 లకు పైగా పౌర సేవలను మీ సేవ కేంద్రాల్లో పొందే వెలుసుబాటు కల్పించారు. తాజాగా మరో తొమ్మిది సేవలను అమల్లోకి తెచ్చారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. దళారుల ప్రమేయం లేకుండా పౌరసేవలు అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో తీసుకొచ్చిన మీ సేవ కేంద్రాల నిర్వాహకులు కొందరు దళారులుగా అవతారమెత్తారు. ఒక్కో ధ్రువపత్రానికి ఇంత అని రేటు కట్టిమరీ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రెవెన్యూ కార్యాలయాల్లో కొందరు ఉద్యోగులతో కుమ్మక్కై డబ్బులు వసూలు చేస్తున్నారు. అడిగిన డబ్బులు ఇచ్చిన వారి దరఖాస్తులు తొందరగా క్లియర్ అవుతుండగా, ఇవ్వని వారి దరఖాస్తులు ఎక్కువ శాతం తిరస్కరణకు గురవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని రకాల సర్టిఫికెట్ల కోసం నోటరీ సమర్పించాల్సి ఉండగా నోటరీ బాండ్లు కూడా మీ సేవ నిర్వాహకులే ఏర్పాటు చేయడం, కొన్ని సందర్భాలలో నోటరీ బాండ్లు లేకుండానే పనులు చేస్తున్నట్లు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మీ సేవ కేంద్రాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

## వంట సామగ్రి అందజేత

మనోహరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన చీర్ల భాస్కర్ యాదవ్ తన సొంత గ్రామానికి ఎంతో కొంత సహాయం చేయాలని కొంతమంది నిరుపేదలకు తమవంతుగా మంగళవారం ఆర్థిక సహాయం అందజేశాడు. గ్రామంలోని మూడు నీరుపేద కుటుంబాలకు ప్రతీ కుటుంబానికి 25 కేజీల బియ్యం, కిరాణా సామగ్రి అందజేశారు. వారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని తెలుసుకుని ఆర్థిక సాయం చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే మనోహరాబాద్ గ్రామంలో తమవంతుగా గతంలో శవపేటిక, క్రికెట్ టీంకు టీ షర్టులు, గ్రంథాలయానికి కుర్చీలు, పుస్తకాలు, కిటికీల ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాబురావు, మహిపాల్ యాదవ్, శివగౌడ్, నవీన్, నరేష్‌గౌడ్, యువకులు పాల్గొన్నారు.

# నాలుగు నెలలుగా జీతాల్లేవ్..!

**● 104 ఉద్యోగుల వెతలు**

సంగారెడ్డి అర్బన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 104 ఉద్యోగులకు నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదు. ప్రజలకు వైద్య సేవలందించే క్రమంలో భాగంగా వీరు క్షేత్ర స్థాయిలో వేర్వేరు విభాగాల్లో పనిచేస్తున్నారు. 2024 ఏడాది చివరిలో పూర్తి వేతనాలు వస్తాయని ఆశించిన ఉద్యోగులను నిరాశే మిగిలింది. ఫలితంగా చాలా మంది ఉద్యోగులు కనీసం పండుగలు చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త సంవత్సరంలోనైనా వేతనాలు ఇవ్వాలని ఉద్యోగులు వేడుకుంటున్నారు.



సంగారెడ్డిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

**42 మంది ఉద్యోగులు**

వైద్య ఆరోగ్య శాఖలోని 104 విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులు 42 మంది ఉన్నారు. వారిలో ఫార్మసిస్టులు 13 మంది, ఎల్‌టీ-10, డీఈవో-5, డ్రైవర్-8, సెక్యూరిటీ-4, అటెండర్-1, ఎల్‌డీ కంప్యూటర్-1 విధులు నిర్వర్తిస్తున్నారు. 2021 ఏడాదిలో 104 వాహన సేవలను ప్రభుత్వం నిలిపి వేయడంతో వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎన్‌సీడీ క్లినిక్‌లు, డీఎంహెచ్‌వో, డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయాల్లో సర్దుబాటు చేశారు. నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతా తామంతా ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వేతనాలు విడుదల చేయాలని లేకపోతే జిల్లాలో వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని 104 ఉద్యోగులు తెలిపారు. అయితే, బడ్జెట్ లేమి సమస్య కారణంగా వేతనాలు విడుదల చేయడం లేదని అధికారులు చెబుతున్నారు.

## ప్రజా నాయకుడు ముత్యంరెడ్డి

చేగుంట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా నాయకుడు ముత్యంరెడ్డి అని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వడ్ల నవీన్ పేర్కొన్నారు. బుధవారం చేగుంట మండలంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తా వద్ద మాజీమంత్రి చెరుకు ముత్యంరెడ్డి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, బాల్‌రెడ్డి, భాస్కర్, శ్రీకాంత్, పుర్ర అగం, రాజాగౌడ్, పరంజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.


మాజీ మంత్రి ముత్యంరెడ్డి జయంతి

## 34వ పర్యాయం రక్తదానం



ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్న ధన్‌రాజ్

తూప్రాన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చని పోతరాజు ధన్‌రాజ్ తెలిపారు. పట్టణానికి చెందిన మాజీ వార్డుసభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు పోతరాజు ధన్‌రాజ్ బుధవారం 34వ పర్యాయం రక్తదానం చేశాడు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదానం చేశాడు. అనంతరం షిర్డీ సాయి సేవ ట్రస్టులో అన్నదానం చేశారు.

## ఫ్లెక్సీ విషయంలో గొడవ

చేగుంట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నార్సింగి మండలం వల్లూర్‌లో నూతన సంవత్సరం వేడుకల పురస్కరించుకుని ఫ్లెక్సీ విషయంలో ఇరువర్గాల మధ్య మంగళవారం రాత్రి ఘర్షణ చోటు చేసుకున్నది. విషయం తెలుసుకున్న నార్సింగి ఎస్‌ఐ అహ్మద్ మొహినోద్దీన్ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. గ్రామంలో ఎలాంటి గొడవలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమాచారం తెలుసుకున్న రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్‌కు చేరుకుని గ్రామస్థులను శాంతింపజేశారు. గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



## క్రైం కార్నర్

### 12 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

తూప్రాన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్‌లో 12 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశామని తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపారు. తూప్రాన్ పట్టణ శివారులోని అల్లాపూర్ వద్ద అర్ధరాత్రి వద్ద పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 12 మంది పట్టుబడగా, వారి వద్ద నుంచి రూ.52,500 నగదు, 12 మొబైల్ ఫోన్లు, ఐదు బైకులు, ఒక యాక్టివా, ఆటోను సీజ్ చేసినట్లు వివరించారు.

### డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిపై కేసు

నారాయణఖేడ్/శివ్వంపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లో మంగళవారం అర్ధరాత్రి వరకు డీఎస్పీ వెంకట్‌రెడ్డి పట్టణంలోని ప్రధాన చౌక్‌లలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీశైలం సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా 13 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు, 40 మందిపై ఎంవీ యాక్ట్ కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ శ్రీశైలం వివరించారు. అలాగే శివ్వంపేటలో 9 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

### దాడిచేసిన వ్యక్తులపై కేసు

శివ్వంపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రెస్టారెంట్ నిర్వాహకుడిపై దాడిచేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని తుక్యతండాకు చెందిన సభావత్ రమేష్, కోల నాజాన్ కలిసి ఆరునెలల క్రితం శివ్వంపేటలోని పవన్ రెస్టారెంట్‌ను అద్దెకు తీసుకొని నిర్వహిస్తున్నారు. కాగా డిసెంబరు 31 రాత్రి సుమారు పదిన్నర గంటలకు రెస్టారెంట్ మూసివేసే సమయంలో శివ్వంపేట గ్రామానికి చెందిన పెద్దకోళ్ల ప్రవీణ్, చింతకింది భిక్షపతి వచ్చి చికెన్ లాలిపప్‌లు ఇవ్వమని అడిగారు. రెస్టారెంట్ మూసేస్తున్నామని నిర్వాహకులు చెప్పడంతో ప్రవీణ్, భిక్షపతి రెస్టారెంట్‌లోకి ప్రవేశించి దుర్భాషలాడుతూ ముఖంపై దాడిచేశారని రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

# పతంగులు వచ్చేశాయ్..

- సంక్రాంతికి ముందే సందడి షురూ
- ఖేడ్‌లోని దుకాణాల్లో అందుబాటులోకి..
- వివిధ రంగులు, ఆకారాల్లో లభ్యం



నారాయణఖేడ్‌లోని ఓ దుకాణంలో విక్రయానికి సిద్ధంగా పతంగులు, చెరకలు, మాంజాలు

నారాయణఖేడ్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వచ్చిందంటే చాలు చిన్నారులు, యువకులు పోటీపడి మరి పతంగులు ఎగురవేస్తుంటారు. వారివారి అభిరుచులను దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు కూడా వివిధ రంగులు, ఆకారాల్లో గాలిపటాలను అందుబాటులోకి తెస్తున్నారు. ఈసారి సంక్రాంతి పండగకు పక్షం రోజుల ముందే మార్కెట్‌లో పతంగుల సందడి మొదలైంది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని దుకాణాల్లో పతంగులు, చెరకలు, దారాలు, మాంజాలు విక్రయించడానికి సిద్ధంగా ఉంచారు. గత సంవత్సరం కంటే 25 శాతం వరకు ధరలు అధికంగా ఉన్నాయి. సైజు, నాణ్యతను బట్టి రూ.3 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు. సాదా, చంకీ, గోళీదార్, అంకేదార్, నాలుగు బద్దలు, స్టార్, క్యాండిల్, చోటాభీమ్, ఇండియా, రాకెట్, కథానాయకుల చిత్రాలతో తయారు చేసిన పతంగులు లభిస్తున్నాయి. పతంగులను ఎగుర వేయడానికి ఉపయోగించే మాంజా(దారం)ల సంబంధించి కంగోజ్, మోకో నైట్, మోకోఫిల్, డ్రాగన్, బాహుబలి, టైగర్ తదితర రకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిని రూ.10 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. ఇక దారం చుట్టడానికి ఉపయోగించే చెరకలు రూ.10 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. ఈ సారి ధరలు కొంత అధికంగా ఉండడంతో చిన్నారులు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదని, దీంతో ఇంకా విక్రయాలు పుంజుకోలేదని వ్యాపారులు రాములు, సాయిలు తెలిపారు.

**జాగ్రత్తలు తప్పనిసరి**

స్లాబులు, మిద్దెలు, రోడ్లపై పతంగులు ఎగురవేసేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ తీగలు, వాహనాల రాకపోకలపై అప్రమత్తంగా ఉండాలి. మైదానాలు, ఖాళీ ప్రదేశాల్లో ఎగురవేయాలి. చిన్నారులు తల్లిదండ్రులు పర్యవేక్షణలో గాలిపటాలు ఎగురవేయడమే ఉత్తమం.



ఖేడ్‌లో వివిధ రకాల పతంగులను చూపుతున్న విక్రయదారుడు

క్రైం కార్నర్

## పడుకున్న వ్యక్తి పైనుంచి వెళ్లిన లారీ

● అక్కడికక్కడే మృతి



కృష్ణ(ఫైల్)

హత్నూర, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన పడుకున్న వ్యక్తిపై నుంచి పొట్టు లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మల్కాపూర్ గ్రామానికి చెందిన నీరుడి కృష్ణ (27) మంగళవారం రాత్రి మద్యం మత్తులో మల్కాపూర్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారి పక్కన పడుకున్నాడు. అది గమనించని పొట్టు లారీ డ్రైవర్ కృష్ణ పై నుంచి తీసుకెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు అక్కడికి చేరుకుని సీసీ ఫుటేజీ పరిశీలించగా ప్రమాద దృశాలు కనిపించాయి. ఈ మేరకు హత్నూర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణ మృతికి ఓ పరిశ్రమకు చెందిన లారీనే కారణమని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు ఆ ఎరిశ్రమ ఎదుట ఆందోళన చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు..



భాను చందర్(ఫైల్)

కొండపాక, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేళ కొండపాక మండలం వెలికట్టలో విషాదం నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మెరుగు భాను చందర్ (22)అనే యువకుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అతడి స్నేహితుడు అమ్ముల భానుతో కలిసి మంగళవారం రాత్రి 11 గంటలు దాటిన తర్వాత పని నిమిత్తం రవీంద్రనగర్‌కు మోటార్ సైకిల్‌పై వెళ్లారు. తిరిగి వెలికట్టకు వస్తుండగా క్రాస్ రోడ్డు సమీపంలో ప్రమాదవశాత్తు బైకు అదుపుతప్పి సూచిక బోర్డు, విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో భానుచందర్ అక్కడికక్కడే మృతి చెందగా, భానుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## డివైడర్‌కు బైక్ ఢీకొట్టి యువకుడు..

జోగిపేట, జనవరి1(ఆంధ్రజ్యోతి): జోగిపేట పట్టణంలో నూతన సంవత్సరం మొదటి రోజున విషాదం నెలకొన్నది. బైక్ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ పాండు కథనం ప్రకారం మండలంలోని అల్మాయిపేటకు చెందిన పాషా(25), వాజీద్ బుధవారం సాయంత్రం బైక్‌పై జోగిపేటకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. బైక్‌ను నడుపుతున్న పాషా పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీ వద్ద ప్రమాదవశాత్తు డివైడర్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో పాషా అక్కడిక్కడే మృతి చెందగా, వాజీద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలిచారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# సీఎం కప్‌లో సిద్దిపేట సత్తా

● యోగాసన పోటీల్లో
రెండు బంగారు, ఒక కాంస్య పతకం

సిద్దిపేట కల్చరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ యోగాసన పోటీల్లో సిద్దిపేట యోగా క్రీడాకారిణిలు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో 25 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఆర్టిస్టిక్ యోగాసన సీనియర్ మహిళా విభాగంలో జిల్లాకు చెందిన లింగంపల్లి సింధూరి, రిథమిక్ సీనియర్ మహిళా యోగా పోటీల్లో ఆకారం మనీషా బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. అలాగే ట్రెడిషనల్ యోగాసన సీనియర్ మహిళా విభాగంలో గుంటపల్లి పూజిత కాంస్య పతకం సాధించారు. సిద్దిపేట జిల్లా వ్యాస మహర్షి యోగా కేంద్రంలో వీరు యోగా సాధన చేస్తున్నారు. జాతీయ యోగా మెడలిస్టు ప్రముఖ యోగా గురురు తోట సతీష్, సంధ్య నేతృత్వంలో యోగా విభాగాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి కారణంగా విజేతలకు మెడల్స్ ప్రదానోత్సవం నిర్వహించలేదు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన యోగా క్రీడాకారులకు జిల్లా యువజన క్రీడాధికారి జయదేవ్ ఆర్యా, తెలంగాణ యోగాసనం స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రాంరెడ్డి, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట ఆశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు.



పతకాలతో యోగా క్రీడాకారులు



చిన్నకోడూరు, పెద్దకోడూరు గ్రామాల్లో ఓ ఇంటి పై కొండ ముచ్చులు



చిన్నకోడూరులో రోడ్డు పై కోతుల గుంపు (ఫైల్)

# ఎటు చూసినా కోతులు.. కొండముచ్చులు

- గ్రామాల్లో గుంపులుగా తిరుగుతూ హల్‌చల్
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు

చిన్నకోడూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కోతులు, కొండ ముచ్చులు (కొండెంగలు) గ్రామాల్లో కిష్కిందకాండను గుర్తు చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఇండ్లు, కిరాణ షాపులలోకి చొరబడి ఆహర పదార్థాలు, నిత్యవసర సామగ్రిని ఎత్తుకెళ్లడంతో పాటు చిందర వందర చేస్తున్నాయి. వాటిని వారిస్తే తమ పై ఎక్కడ దాడి చేస్తాయోనని భయాందోళనకు గురవుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అవి పెంకుటిళ్లపైకి ఎక్కి తిరగడం వల్ల గునపెంకులు వదులుకావడం, పగలడం వల్ల వర్షాలకు ఇండ్లు ఊరుస్తున్నాయని, రేకుల ఇండ్లు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటి బెడదతో నానా తంటాలు పడాల్సి వస్తుందని, కోతులు, కొండముచ్చుల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్

## బ్యాంకు ఖాతా నుంచి రూ. 2.40లక్షలు లూటీ

చేర్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మహిళ బ్యాంకు ఖాతాను సైబర్ నేరగాళ్లు లూటీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన గోనె ప్రేమలతది వ్యవయసాయ ఆధారిత కుటుంబం. కొన్ని రోజులక్రితం ధాన్యం విక్రయించడంతో రూ.2.40లక్షలు చేర్యాల పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. ఆ డబ్బులు తీసుకునేందుకు బ్యాంకుకు వెళ్లిన ఆమెకు బ్యాలెన్స్ లేదని అధికారులు చెప్పడం ఒక్కసారిగా కంగుతిన్నది. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు పలు దఫాలుగా డబ్బులు డెబిట్ అయినట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు. ఈ విషయమై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేస్తున్నారు.

## ప్రముఖ పరిశ్రమల పేరిట నకిలీ మెడిసిన్ తయారీ

జిన్నారం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పరిశ్రమల పేరిట నకిలీ మందులు తయారు చేస్తున్నట్లు డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. బుధవారం హైదరాబాద్‌లో పలు ప్రముఖ పరిశ్రమల పేరిట ఉన్న నకిలీ మెడికల్ డ్రగ్స్, ట్యాబ్లెట్లను పట్టుకున్నారు. ఈ నకిలీ మందులను జిన్నారం మండలం బొల్లారం పారిశ్రామిక వాడలో తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అనుమానం ఉన్న పలు పరిశ్రమలపై అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## చికిత్స పొందుతూ ఇటుకబట్టి కార్మికుడి మృతి

శివ్వంపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఇటుక బట్టీ కార్మికుడు మృతి చెందిన సంఘటన కొత్తపేట రూప్లాతండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిస్సా రాష్ట్రంలోని సన్‌పూర్ తాలూకా బిక్క గ్రామానికి చెందిన బిహారిజెరా(50) కుటుంబ సభ్యులతో కలిసి మండల పరిధిలోని రూప్లాతండా శివారులోని ఇటుక బట్టీలో మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. డిసెంబర్ 28న ఉదయం 9 గంటలకు ఇటుకలు కాల్చిన బట్టి బూడిదని లారీలో నింపేందుకు నిచ్చెన ఎక్కగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. దీంతో అతడిని కుటుంబ సభ్యులు మొదట నర్సాపూర్, తరువాత సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య సిరిమతి జెరా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.





# ఆర్టీసీ బస్సును ఢీ కొన్న లారీ

● ఎనిమిది మందికి గాయాలు

జహీరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ సమీపంలోని అల్గోల్ చౌరస్తా వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు.. లారీ ఢీకొని బస్సులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. జహీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బీదర్ వెళ్లేందుకు బుధవారం అల్గోల్ చౌరస్తా వద్ద 65వ నంబరు జాతీయ రహదారిని దాటుతోంది. ఈ సమయంలో ముంబై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీ కొంది. బస్సులో ప్రయాణికులంతా ముందు సీట్లలో ఉండగా, లారీ వెనుక నుంచి ఢీ కొనడంతో ఎనిమిది మందికి స్వల్పంగా గాయాలు అయ్యాయి. ఆ సమయంలో బస్సులో మొత్తం 28 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆర్టీసీ బస్సు వెనుక భాగం మొత్తం దెబ్బతింది. గాయపడిన వారిని హుటాహుటిన జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, ఎస్‌ఐ కాశీనాథ్‌లు సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు.



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల

# ఒంటికాలిపై నిలబడి నిరసన

సంగారెడ్డి అర్బన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగుల చేస్తున్న సమ్మె 26వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా బుధవారం ఒంటికాలిపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడతూతూ ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు, సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

# పసిడి పంచ్

- బాక్సింగ్‌లో రాణిస్తున్న సంగారెడ్డివాసి
- 24 టోర్నమెంట్లలో పోటీపడిన శ్రీశాంత్‌గౌడ్
- 8 బంగారు పతకాలు, ఒక కాంస్య మెడల్ సొంతం
- పలువురు ప్రముఖులతో ప్రశంసలు



మహారాష్ట్ర నాందేడ్‌లో జరిగిన టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన శ్రీశాంత్ గౌడ్



సంగారెడ్డి రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : బాక్సింగ్ రింగ్‌లోకి శ్రీశాంత్ గౌడ్ దిగితే ప్రత్యర్థుల గుండెల్లో రైలు పరుగెత్తాల్సిందే. బాల్యం నుంచే బాక్సింగ్ దిగ్గజం మైక్ టైసన్ అంటే ఎంతో ఇష్టం. ఇంట్లో టీవీల్లో బాక్సింగ్ సినిమాలను ఆసక్తిగా చూస్తూ అనుకరించేవాడు. శ్రీశాంత్‌లోని ఆసక్తిని చూసి అదే రంగంలో శిక్షణ ఇప్పించారు తల్లిదండ్రులు. సంగారెడ్డి పట్టణం సోమేశ్వరవాడకు చెందిన కలాలి బాగన్నగౌడ్, నిర్మల దంపతులు కుమారుడు శ్రీశాంత్‌గౌడ్ 4వ తరగతి చదువుతున్న సమయంలో బాక్సింగ్‌పై ఉన్న ఆసక్తిని తెలుసుకున్న కోచ్ ఆనంద్ భాస్కర్ ప్రత్యేక శిక్షణను అందించారు. కఠోరమైన శిక్షణలో రాటుదేలి అదిలాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌కి సెలెక్ట్ అయ్యాడు. అక్కడే ఉంటూ విద్యతో పాటు క్రీడల్లో పాల్గొంటున్నాడు. హైదరబాద్‌లోని హకీమ్‌పేటలోని స్పోర్ట్స్ అకాడమీలో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతూనే జిల్లా, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లలో పాల్గొని ప్రతిభ కనబరుస్తూ వచ్చాడు. ప్రస్తుతం హకీమ్‌పేటలో ఉంటూ వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో డిగ్రీ చేస్తున్నాడు.




వరంగల్‌లో నిర్వహించిన పోటీలో విజేతగా నిలిచిన శ్రీశాంత్‌ను అభినందిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధి

**24 టోర్నమెంట్లు..**

ఇప్పటివరకు శ్రీశాంత్‌గౌడ్ మొత్తం 24 టోర్నమెంట్లలో పాల్గొన్నాడు. 8 జిల్లా స్థాయిలో టోర్నమెంట్లలో పాల్గొని విజేతగా నిలిచారు. అలాగే 10 రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లలో ఆడి 8 బంగారు పథకాలు సాధించగా, 6 జాతీయ స్థాయి టోర్నమెంట్లలో పోటీపడి 2 గోల్డ్ మెడల్స్, ఒకటి కాంస్య మెడల్ సాధించాడు. చదువుతో పాటు బాక్సింగ్‌లో రాణిస్తున్న శ్రీశాంతకు బంగారు భవిష్యత్ ఉంటుందని పలువురు ప్రముఖులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

**అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యం..**



నా తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ అనంద్ భాస్కర్ శిక్షణతోనే బాక్సింగ్‌లో రాణిస్తున్నా. ఇప్పటి వరకు తాను సాధించిన విజయాల వెనక వారి కృషి ఎంతగానో ఉంది. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా ముందుకువెళ్తా. మరిన్ని మెడల్స్ సాధించి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తా.

-శ్రీశాంత్‌గౌడ్, బాక్సింగ్ క్రీడాకారుడు

## న్యూస్ బాక్స్

### 'బీసీల గర్జన సభను విజయవంతం చేయాలి'

మనోహరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే బీసీ గర్జన సభను విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు దాసరి నరేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మనోహరాబాద్ మండలం నుంచి ఐదువేల మంది బీసీలు సభకు తరలివెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు పంజా భిక్షపతి, నాగభూషణం, రాజుయాదవ్, వెంకటేష్, యాదయ్యయాదవ్, మురళీమోహన్, బాలేష్ గౌడ్ పాల్గొన్నారు.

### శబరిమలకు బయలుదేరిన అయ్యప్పస్వాములు

శివ్వంపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నియమ నిష్ఠలతో 41 రోజులపాటు కఠిన దీక్ష చేసిన శివ్వంపేటకు చెందిన 22 మంది అయ్యప్పస్వాములు గురువారం వేదపండితులు గురు స్వామి వామన్‌శర్మ సమక్షంలో ఇరుముడి పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వామి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శబరిమలకు బయలుదేరారు. ముందుగా అయ్యప్పస్వామికి పడిపూజ నిర్వహించి, ఇరుముడితో గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మాజీ సర్పంచ్, ప్రముఖ వ్యాపారవేత కల్లూరి హనుమంత్‌రావు,కీర్తన దంపతులు భక్తులకు అన్నదాన వితరణ చేశారు.

### నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేడు మనూరు, నారాయణఖేడ్, నాగల్‌గిద్ద, నిజాంపేట మండలాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని బుధవారం క్యాంపు కార్యాలయం వారు ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరై చెక్కులు స్వీకరించాలని కోరారు.

### 'హలో మాదిగ - చలో గజ్వేల్'ను విజయవంతం చేయాలి

మర్కుక్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని మర్కుక్ మండ ల కన్వీనర్ బండి భిక్షపతి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి 'హలో మాదిగ - చలో గజ్వేల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల జేఏసీ కమిటీ సభ్యులు టీచర్ పరశురాం తదితరులు పాల్గొన్నారు.

### మున్నూరుకాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

చేర్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం భవనంలో సంఘం నూతన క్యాలెండర్‌ను పట్టణాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు వెలుగల రాజు, ప్రధాన కార్యదర్శి దుర్గయ్య, ప్రతినిధులు పాల్గొన్నారు.

### అందుబాటులో యూరియా



సొసైటీలో నిల్వ చేసిన యూరియా

మద్దూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేబర్తి సహకార సొసైటీ ఆధ్వర్యంలో మద్దూరులో రైతులకు అందుబాటులో యూరియా ఏర్పాటు చేసినట్లు సీఈవో బోయిని శ్రీధర్ తెలిపారు. మండలంలో వరి కోతల అనంతరం రైతులు ఎక్కువ సంఖ్యలో మొక్కజొన్న సాగు చేపట్టారని రైతుల అవసరాలకు అనుగుణంగా 560 బస్తాల యూరియాను తెప్పించినట్లు తెలిపారు. హమాలీతో కలిపి రూ.280 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.

### అయ్యప్పస్వాములకు అల్పాహారం

సిద్దిపేట టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి మాలవిరమణ సందర్భంగా మణికంఠ స్వామి దర్శనం కోసం శబరిమల బయలుదేరిన స్వాములకు సిద్దిపేట పట్టణ 20వ వార్డు కౌన్సిలర్ మహ్మద్ రియాజుద్దీన్ అల్పాహారం, పండ్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవించుకోవాలన్నారు.

### చేర్యాలలో 12 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

చేర్యాల, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం రాత్రి చేర్యాలలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి సీఐ ఎల్. శ్రీనివాస్, ఎస్ఐ నీరేశ్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్న వాహనచోదకులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రాణాలకు ముప్పుతెచ్చుకోకూడదని సూచించారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న పీజీ కాలేజీ



కాంట్రాక్టు లెక్చరర్లతో సాగుతున్న క్లాసులు

# అరకొర వసతులు.. అధ్వాన చదువులు

- సమస్యల వలయంలో నర్సాపూర్ పీజీ కళాశాల
- సొంత భవనం లేక అవస్థలు
- అధ్యాపకులు, సిబ్బంది కొరత
- గెస్ట్ టీచర్లతో బోధన

నర్సాపూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఉన్న ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ఏకైక ప్రభుత్వ పీజీ కళాశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. సొంత భవనం, సరైన బోధనా సిబ్బంది, అధ్యాపకులు లేక విద్యార్థుల చదువులు ఆగమవుతున్నాయి. నర్సాపూర్‌లో 2015-16లో ఐదు కోర్సుల్లో పీజీ కాలేజీని ప్రారంభించారు. అయితే సొంత భవనానికి ఇక్కడి అధికారులు స్థలం చూపకపోవడంతో నర్సాపూర్-హైదరాబాద్ ప్రధాన రోడ్డు సమీపంలో ఓ అద్దె భవనలో కొనసాగుతోంది. ఈ అద్దె భవనం కూడా సరిపోకపోవడం, అధ్యాపకులు, సిబ్బంది కొరత కారణంగా మంజూరైన ఐదు కోర్సుల్లో ఎమ్మెస్సీ(ఇన్‌ఆర్గానిక్), ఎంసీజే రెండు కోర్సుల అడ్మిషన్లు రెండేళ్లుగా నిలిపేశారు. ప్రస్తుతం ఎంబీఏ, ఎమ్మెస్సీ(మ్యాథ్స్), ఎమ్మెస్సీ(ఆర్గానిక్) మూడు కోర్సులతో కాలేజీ కొనసాగుతోంది.

**అంతా గెస్టు లెక్చరర్లతోనే బోధన**

పీజీ కాలేజీలో రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడంతో ఇక్కడ చదువుకునేందుకు చాలామంది ఆసక్తి చూపడం లేదు. గణిత, రసాయనశాస్త్రం విభాగాల్లో 40, ఎంబీఏలో 60 సీట్ల చొప్పున ప్రవేశాలు పొందే అవకాశం ఉంది. అయితే విద్యార్థులకు తగ్గటు 21 మంది ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం ఐదుగురు కాంట్రాక్ట్ పద్ధతి, మరో మరో 17 మంది అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారు. వీరంతా వారంలో ఒకసారి.. వారికి సమయం ఉన్నప్పుడు వచ్చి బోధన చేస్తుండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అలాగే పీజీ కాలేజీలో నాన్‌టీచింగ్ సిబ్బంది 35 మంది ఉండాల్సి ఉండగా.. కేవలం ముగ్గురితో నెట్టుకొస్తున్నారు. ఈ ముగ్గురు అన్ని అంశాలు చూడాల్సి వస్తుండడంతో పనిభారం పెరిగి.. సకాలంలో పనులు కాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

**సొంత భవనం కోసం ఎదురుచూపులు**

పీజీ కాలేజీ ఏర్పడినప్పుడే యూనివర్సిటీ నుంచి సొంత భవన నిర్మాణం కోసం రూ.20 కోట్లు కేటాయించారు. ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు స్థలం కేటాయింపు విషయంలో నిర్లక్ష్యం చేస్తుండటంతో అసౌకర్యాల మధ్య అద్దె భవనంలో చదువులు సాగాల్సి వస్తున్నది. ఓ దశలో యూనివర్సిటీ ఇక్కడి పీజీ కాలేజీ ఎత్తేయాలనే ఆలోచన వచ్చింది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు ఆలోచించి విద్యార్థులకు మేలు కలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## దేశంలోనే మొదటి ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్/రామాయంపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ)-2025 డైరీని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సంగారెడ్డిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ మాట్లాడుతూ దేశంలోనే మొదటి ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ అని మంత్రికి వివరించగా, మంత్రి స్పందిస్తూ ఎస్టీయూ సంఘంతో తనకు పరిచయం ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, రాష్ట్ర కార్యదర్శి జీవన్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నారాయణఖేడ్‌లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశం, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు. రామాయంపేటలో డీసీసీబీ క్యాలెండర్‌ను సొసైటీ చైర్మన్ బాదే చంద్రం, సీఈవో పుట్టి నర్సింహులు ఆవిష్కరించారు. బ్రాంచ్ మేనేజర్ శ్వేతరెడ్డి, సిబ్బంది ఉన్నారు.



సంగారెడ్డిలో ఎస్టీయూ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

## సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : పేదవారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన ఇందిరమ్మ ఇంటి పథకం పారదర్శకంగా అమలు చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మించే స్థలాన్ని అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. ప్రతీ ఒక్క పేదవారికి సొంత ఇల్లు ఉండాలన్న లక్ష్యంతో ఆనాడు ఇందిరమ్మ అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆమె స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకం అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇళ్ల కోసం దళారులను ఆశ్రయించకూడదన్నారు. ఆధునిక హంగులతో మోడల్ ఇందిరమ్మ ఇంటిని త్వరలోనే నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ ఏఈ సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మించే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

## రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలి



రేజింతల్ సిద్ధివినాయక ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, యజ్ఞాలు చేస్తున్న దృశ్యం

న్యాల్‌కల్, జనవరి 1 ఆంధ్రజ్యోతి) : సిద్ధివినాయకుడి ఆశీస్సులతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్ధివినాయక జయంతిలో భాగంగా బుధవారం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం రేజింతల్ గ్రామంలో గల సిద్ధివినాయకుడిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడుతూ స్వయంభువు సిద్ధివినాయకుడు ప్రతియేటా శరీర ఆకారం పెరగడం ప్రత్యేకతను సంతరించుకుంటుందన్నారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీడీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పార్టీ మండలాధ్యక్షులు రవీందర్, నారాయణ, వెంకటేశం, నర్సింహులు, సంజీవరెడ్డి పాల్గొన్నారు. అలాగే సిద్ధివినాయక ఆలయంలో బుధవారం యజ్ఞం నిర్వహించారు. దంపతులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హద్నూర్ పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

## సర్వరోగ నివారిణి నీరా


- కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్



నాగాపూర్‌లో నీరా కేఫ్‌ను ప్రారంభిస్తున్న కేజీకేఎస్ నాయకులు

సంగారెడ్డి రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : సర్వరోగ నివారిణిగా నీరా పనిచేస్తుందని కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ తెలిపారు. సంగారెడ్డి మండలం నాగాపూర్ గ్రామంలో గురువారం నీరాకేఫ్‌ను ప్రారంభించి మాట్లాడారు. నీరాతో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, ఎలాంటి విష జ్వరాలైనా, ఎంతటి ప్రమాదమైన రోగాలనైనా తగ్గిస్తుందన్నారు. నీరాను చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు సేవించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగన్నగౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

### ఎన్‌సీసీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా నాగరాజు



సదాశివపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ తెలంగాణ గవర్నెన్స్ వింగ్ జాయింట్ సెక్రెటరీగా సదాశివపేట పట్టణానికి చెందిన చుక్కల నాగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చుక్కల నాగరాజు మాట్లాడుతూ మానవత్వమే దైవత్వమన్నారు. సృష్టిని పరిమళింపజేసేది మానవత్వమేనన్నారు. జాతీయ క్రిస్టియన్ కమ్యూనిటీలో తనకు ఉన్నత పదవిని కట్టబెట్టిన నేషనల్ క్రిస్టియన్ ఫౌండర్, ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ శామ్‌పాల్‌కు చుక్కల నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. తనకు దక్కిన పదవి, హోదాకు తేడా చూపకుండా స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని మానవ హక్కుల పరిరక్షణకు పోరాటం చేస్తానన్నారు.

### రాంపూర్ కోటిలింగాల ఆలయంలో భవానీ చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణం

తొగుట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తొగుట - రాంపూర్ కోటిలింగాల ఆలయంలో బుధవారం భవానీ చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణోత్సవం రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి పర్యవేక్షణలో అర్చకుడు పసాద్‌శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్ఫటిక లింగేశ్వరస్వామికి 1,100 కిలోల పెరుగుతో అభిషేకం నిర్వహించారు. అనంతరం కృష్ణానందస్వామి పల్లకీసేవతో పాటు పాదుకపూజా కార్యక్రమం జరిగింది. కల్యాణోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు మాధవానంద సరస్వతీ స్వామి అనుగ్రహభాషణం చేసి ఆశీర్వదించారు. ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.



జహీరాబాద్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీమంత్రి హరీశ్‌రావు, తదితరులు



గుమ్మడిదల మండల కేంద్రంలో నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న రైతులు

## అంబరాన్నంటిన సంబరాలు

నూతన సంవత్సర వేడుకలు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. యువకులు, ప్రజలు అర్ధరాత్రి వరకూ డీజే సౌండ్లతో ఎంజాయ్ చేశారు. బుధవారం ఉదయం ఆయా మండలాల్లో, గ్రామాల్లో ఉన్న ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ ఏడు అంతా మంచి జరగాలని, అనుకున్నవి సాధించాలని కోరుకున్నారు.

\- న్యూస్ నెట్‌వర్క్



సంగారెడ్డి పట్టణ శివారు వైకుంఠపురంలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు క్యూలో బారులు తీరిన భక్తులు

## తగ్గేదేలే..!

5వ పేజీ తరువాయి

పోలీసులు ముందుగానే విస్తృత ప్రచారం చేసినా పెడచెవిన పెట్టారు. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి పట్టణాల్లో డిసెంబరు 31 అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వాహనాల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో మొత్తం 282 మంది మందుబాబులు మద్యం తాగి పోలీసులకు చిక్కారు. సంగారెడ్డి పట్టణంలోనే అత్యధికంగా 128 మంది డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులకు చిక్కారు. పటాన్‌చెరులో 101, జహీరాబాద్‌లో 31, నారాయణఖేడ్‌లో 22మందిని పోలీసులు పట్టుకున్నారు. వీరందరి వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ప్రభుత్వ సెలవు కావడంతో గురువారం ఉదయం మందుబాబులను జిల్లాలోని ఆయా కోర్టులలో ప్రవేశపెట్టనున్నారు. మందుబాబులకు జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉందని పోలీసు వర్గాలు అంటున్నాయి. మరి కొత్త సంవత్సర వేడుకల్లో మద్యం తాగడం అటుంచి కొత్త సంవత్సరం మొదటి రోజే జైలు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తోందని పలువురు మందుబాబులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**జైలు శిక్ష తప్పదు : సంగారెడ్డి ఎస్పీ రూపేష్**

కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం తాగి రోడ్లపైకి వస్తే జైలు శిక్ష తప్పదని ఇదివరకే హెచ్చరించామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన 282 మందిని గురువారం జిల్లాలోని న్యాయస్థానాల్లో హాజరుపరుస్తామని తెలిపారు. వీరందరికీ న్యాయమూర్తులు జరిమానాలతో పాటు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చేందుకే చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### హరీశ్‌రావుకు మోయిద్‌ఖాన్ శుభాకాంక్షలు

నారాయణఖేడ్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును బీఆర్ఎస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు మోయిద్‌ఖాన్ బుధవారం హైదరాబాద్‌లో కలిసి పుష్ప గుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మోయిద్‌ఖాన్‌ను అభినందించారు.



హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న మోయిద్‌ఖాన్

### విద్యార్థుల ఎదుగుదలకు మొదటి మెట్టు ప్రాథమిక పాఠశాలే

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి



ప్రాథమిక పాఠశాల ఆవరణలో సీజీఆర్ ట్రస్టు ద్వారా విద్యార్థులకు బోరు వేయించి నీటి వసతిని కల్పిస్తున్న చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

గుమ్మడిదల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఎదుగుదలకు మొదటి మెట్టు ప్రాథమిక పాఠశాల అని, ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులు బాగా చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు నీటి వసతి లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి తన సొంత నిధులతో బుధవారం మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, యువజన సంఘాల, అఖిలపక్ష నాయకుల సమక్షంలో నీటి బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు గోవర్ధన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మొగులయ్య, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, గ్రామ పెద్దలు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

### సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలి




రాయికోడ్‌లో లింగాయత్ సమాజ్ బాధ్యులను సన్మానిస్తున్న దృశ్యం

రాయికోడ్, 1 జనవరి (ఆంధ్రజ్యోతి) : వీరశైవ లింగాయత్ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలనియువజన విభాగం కార్యనిర్వాహక జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల ప్రశాంత్‌పాటిల్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని భద్రకాళి సమేత వీరభద్ర ఆలయంలో నిర్వహించిన మండల లింగాయ సమాజ్ సమావేశంలో మాట్లాడారు. 5న సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సంగారెడ్డిలో నిర్వహిస్తున్నామని, సమాస్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమాజ్ నాయకులు రాజేశ్వర్, సంతోష్‌కుమార్, బస్వరాజ్‌పాటిల్, హన్మంత్‌రావు, రాచయ్యస్వామి, మనీల్, తదితరులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ యువజన సంఘానికి డప్పులు, డ్రెస్సుల పంపిణీ

సిద్దిపేట అర్బన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, ఉపసర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు, ఉపసర్పంచ్ సంతోష్ 24 మందికి డప్పులు, దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ తండ్రి రిటైర్డ్ టీచర్ చింతల ఐలయ్య జ్ఞాపకార్థం గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘంలోని సభ్యులకు డప్పులు, దుస్తులు పంపిణీ చేసినట్టు చెప్పారు. తమ తండ్రి ఐలయ్య ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పించి ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన జ్ఞాపకార్థం ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు పయ్యావుల రాములు, మాజీ ఎంపీటీసీ అంకుశ్‌వాలీ, నాయకులు కనకమల్లయ్య, రాములు పాల్గొన్నారు.



దుస్తులు, డప్పులు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్, మాజీ ఉపసర్పంచ్